## క్లుప్తంగా

### ఉత్సవాలకు తరలిరండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కడెం: జిల్లా కేంద్రంలో ఈనెల24న నిర్వహించే సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు బంజారాలు తరలిరావాలని ఉత్సవ కమిటీ నాయకులు కిషన్‌నాయక్, రాజేశ్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, సత్తన్న, రమేశ్ తదితరులు ఉన్నారు.

### వరి పంట పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని అర్లి(కె) గ్రామంలో వరి పంటను శుక్రవారం ఏఓ జాదవ్ సాయికిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

### అల్ఫోర్స్‌లో శివరాత్రి వేడుకలు



ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

నిర్మల్: జిల్లాకేంద్రంలోని ఆదర్శనగర్ అల్ఫోర్స్ స్కూల్‌లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శివపూజ చేయడంతోపాటు పార్వతీ పరమేశ్వరులు, గణపతి, కార్తికేయ, శివపరివారం వేషధారణలతో ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### 'నూతన చట్టం రద్దు చేయాలి'

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ చట్టం-2020 రద్దు చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పోడు పట్టాలు పంపిణీ చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు. ఈనెల 20న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే మహాధర్నా జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లన్న, రాజన్న, లచ్చన్న, లక్ష్మణ్, భగవంత్‌రావు, వర్మ, రవి, ముస్వత్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

### కేంద్ర పథకాలను వివరించాలి

ఖానాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నియోజకవర్గ నాయకులు అజ్మీరా హరి నాయక్ అన్నారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో శుక్రవారం కొత్తపేట్, బావాపూర్(కే) శక్తి కేంద్రం ఇన్‌చార్జి పల్లె అశోక్, బీజేపీ మండలాధ్యక్షుడు టేకు ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పడాల రాజశేఖర్, ఎనగందుల రవి, సుధాకర్, రాజేశ్వర్, రాజ్‌కుమార్, ప్రవీణ్, గంగరాజం తదితరులు ఉన్నారు.

### 'కంటివెలుగు' పరిశీలన

లోకేశ్వరం: కంటివెలుగును పకడ్బందీగా నిర్వహించాలని లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని గౌడిసెరా లో కంటివెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. సర్పంచ్ కారగిరి భోజవ్వ, ఉపసర్పంచ్ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో శుక్రవారం కంటివెలుగు శిబిరాన్ని ఎంపీడీవో మల్లేశ్, సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి లావణ్య, గ్రామస్తులు ఉన్నారు.

# సిద్ధమవుతున్న నర్సరీలు

- గ్రామాల్లో ఉపాధి పొందుతున్న కూలీలు
- నిర్వహణ పనులు పరిశీలిస్తున్న అధికారులు
- మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



హస్నెల్లిలో నర్సరీ వద్ద ఎంపీడీవో శ్రీనివాస్



ఉమ్రి(కే)లో మొక్కలకు నీరు పడుతున్న కూలీ

తానూరు: తెలంగాణలో పచ్చదనం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తొమ్మిదో విడత హరితహారానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహణ..**

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి పంచాయతీకో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపడుతున్నారు. తానూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. మండలంలోని మొత్తం 31 గ్రామపంచాయతీల్లో నర్సరీ నిర్వహణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతీ పంచాయతీలో 11 వేల చొప్పున మొత్తం మండలవ్యాప్తంగా 3.41 లక్షల మొక్కలు పెంచేందుకు సన్నద్ధమవుతున్నారు.

మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ఆలయాల ప్రాంగణాలు, బస్టాండ్, రోడ్లకు ఇరువైపులా, రైతులకు ఉపయోగపడే అన్ని రకాల మొక్కలు నాటించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు నర్సరీలో పండ్ల మొక్కలైన నిమ్మ, దానిమ్మ, సీతాఫలం, ఉసిరితోపాటు పూల మొక్కలైన గులాబీ, మందార, గన్నేరు, కాగితపు పూల మొక్కలతో పాటు రోడ్డుకు ఇరువైపులా నాటేందుకు జామ, మారేడు వంటి మొక్కలను సిద్ధం చేస్తున్నారు. గ్రామాల్లో జరుగుతున్న నర్సరీ పనులను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులతోపాటు ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో గంగాధర్ పరిశీలిస్తున్నారు.

**కూలీలకు ఉపాధి..**

మండలంలోని అన్ని పంచాయతీల్లో నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొక్కల పెంపకం పనులతో ఒక్కో గ్రామంలో 42 మంది కూలీలకు ఉపాధి దొరుకుతుంది. ప్రస్తుతం నర్సరీలో మట్టి పనులు, కవర్లో మట్టి నింపి మొలకలను నాటించడంలో అధికారులు నిమగ్నమై ఉన్నారు.

### కూలీలకు ఉపాధి



గ్రామంలో నర్సరీల పనులు కొనసాగుతుండటంతో కూలీలకు ఉపాధి దొరకుతుంది. నర్సరీ ఏర్పాటుతోపాటు మొలకలకు నీటిని అందించే పనులు చేస్తున్నాం.

– సూర్యకాంత్, ఉమ్రి(కే)

### పనులు పర్యవేక్షిస్తున్నాం



గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో నర్సరీ పనులు సాగుతున్నాయి. తొమ్మిదో విడత హరితహారం పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నిత్యం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు సూచనలు అందిస్తున్నాం.

– గంగాధర్ ఈజీఎస్ ఏపీవో

## అటెన్షన్ ప్లీజ్.. చెత్తాచెదారం తొలగించరూ



లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్ గ్రామ శివారులో గోదావరి ఒడ్డున బ్రహ్మేశ్వరాలయం ఉంది. ఇక్కడున్న పుష్కరఘాట్ మెట్లపై చెత్తాచెదారం, బురద నెలకొని అపరిశుభ్రంగా మారింది. దీంతో మహాశివరాత్రి పండుగ నేపథ్యంలో పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ఘాట్ వద్ద పరిసరాలు శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: భోజన్న, కన్కపూర్ కార్యదర్శి, ఫోన్: 9603104948

### పదిమందిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

భైంసాటౌన్: కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కొనసాగుతూనే ఉంది. ఇటీవల భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు, జీపీఎల్ డిగ్రీ కళాశాల, ముధోల్‌లోని శ్రద్ధ డిగ్రీ కళాశాలల్లో 32 మంది విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా శుక్రవారం జరిగిన పరీక్షల్లో మరో పదిమంది విద్యార్థులు మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడ్డారు. జిల్లాకేంద్రంలోని చాణక్య డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆరుగురు, ఎస్‌బీఆర్ కళాశాలలో ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ అధికారులు తెలిపారు.

### కార్యవర్గం ఎన్నిక

ముధోల్: మండలంలోని ఆష్ట గ్రామంలో శుక్రవారం లిఫ్ట్ ఇరిగేషన్ కోఆపరేటివ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని శ్రీజ్ఞానసరస్వతి లిఫ్ట్ ఇరిగేషన్ కోఆపరేటివ్ అధ్యక్షుడిగా ముస్కు మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భోజన్న, కార్యదర్శిగా రాములు, డైరెక్టర్‌గా అశోక్, లోలం భూమన్న, దేవేందర్‌రెడ్డి, సాయారెడ్డిని ఎన్నుకొన్నారు. కార్యవర్గాన్ని జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఎండీ సద్దాం హుస్సేన్, సాహేందర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీలు సునీత, పోశెట్టి ఉన్నారు.

**పద్మశాలి సంఘం..**

కుంటాల: కుంటాల మండల పద్మశాలి సంఘం నెంబర్-2 నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొట్ట జనార్దన్, ఉపాధ్యక్షుడిగా చిప్ప గజేందర్, కోశాధికారిగా పొట్ట రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

### రైతుబజార్‌లో..

| కూరగాయలు | కిలో(రూ.లో) |
| --- | --- |
| టమాటా | 10 |
| వంకాయ | 40 |
| బెండకాయ | 40 |
| పచ్చిమిర్చి | 60 |
| కాకరకాయ | 50 |
| బీరకాయ | 60 |
| క్యారెట్ | 80 |
| గోరుచిక్కుడు | 60 |
| కొత్తిమీర | 100 |
| అల్లం | 50 |
| ఎల్లిగడ్డ | 60 |
| ఉల్లిగడ్డ | 20 |
| ఆలుగడ్డ | 25 |

- నిర్మల్‌టౌన్

### సినిమాలు




తిరుమల : సార్
నారాయణ: వినరో భాగ్యం విష్ణు కథ
వెంకటేశ్: వాల్తేరు వీరయ్య

# ప్రత్యేక రాష్ట్రంలోనే ఆలయాల అభివృద్ధి

- ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



కల్యాణ మండపానికి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

నర్సాపూర్(జి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలోనే ఆలయాలు అభివృద్ధి చెందుతున్నాయని ముథోల్ ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లమాడ గ్రామంలో శుక్రవారం రూ.45లక్షలతో నిర్మించే శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం కల్యాణ మండపానికి, రూ.32లక్షలతో నిర్మించే రేణుక ఎల్లమ్మ దేవస్థానం ప్రహరీ, కాలక్షేప మండపం నిర్మాణానికి భూమిపూజ చేశారు. జిల్లాలో ఆలయాల అభివృద్ధికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధిక నిధులు కేటాయిస్తున్నారని కొనియాడారు. అనంతరం తొమ్మిది మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, ఆరుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్న మహేశ్, జెడ్పీటీసీ చిన్న రామయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాపెన్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ వేణుగోపాల్, పలువురు నాయకులు భాస్కర్, భూమేశ్, రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

**పనులు పరిశీలన..**

కుంటాల: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం మన ఊరు–మన బడి కార్యక్రమం చేపట్టిందని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కుంటాల ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలని సూచించారు. వారి వెంట సర్పంచ్ సమతా వెంకటేశ్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, గజేందర్, రాకేశ్, విజయ్ ఉన్నారు.

**ఎమ్మెల్యేను కలిసిన అబ్దుల్లాపూర్ గ్రామస్తులు**

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామస్తులు శుక్రవారం భైంసారూరల్ మండలం దేగాం గ్రామంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అలాగే వివిధ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అబ్దుల్లాపూర్ సర్పంచ్ రమణారెడ్డి, గంగాధర్, సాగర్, రాజారెడ్డి, సభ్యులు ఉన్నారు.

# వల విసరడంలో నైపుణ్యం సాధించాలి



వల విసురుతున్న మత్స్యకారుడు

నర్సాపూర్(జి): చేపలు జారిపోకుండా మత్స్యకారులు వల విసరడంలో నైపుణ్యం సాధించాలని.. అర్హత ఉన్నవారికి మత్స్య సంఘంలో సభ్యత్వం ఇస్తామని మత్స్యశాఖ జిల్లా అధికారి నరసింహ అన్నారు. మండల కేంద్రంలో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్న మత్స్యకారులకు శుక్రవారం పరీక్షలు నిర్వహించారు. చెరువులో ఈత కొట్టడం, రాయితీతో ఇచ్చే ముడిసరుకుతో వల (అల్లడం) తయారు చేయడం, చెరువుల్లో తెప్పలు నడపడం వచ్చిన వారిని అర్హులుగా గుర్తిస్తారు. కార్యక్రమంలో పలువురు అధికారులు జగదీశ్, గయాసొద్దీన్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ పంచాయతీలకు ప్రోత్సాహకం అందిస్తాం

భైంసారూరల్: ముథోల్ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధం పాటించిన గ్రామాలను ఎంపిక చేసి ప్రోత్సాహకం అందిస్తామని ముథోల్ ఇంటలెక్చువల్స్ ఫోరం, మనగుడి–మనబడి ట్రస్ట్ చైర్మన్ బద్దం భోజారెడ్డి అన్నారు. భైంసాలోని శివాజీచౌక్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఏడు మండలాల్లో కమిటీ సభ్యులు పరిశీలించి ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి ముథోల్ ఇంటలెక్చువల్స్ ఫోరం, మనగుడి–మనబడి ట్రస్ట్ ద్వారా రూ.లక్ష బహుమతి అందిస్తామన్నారు. పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

# సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు



కుభీర్‌లో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి స్వీటు తినిపిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కుభీర్: మండలకేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే జి.విఠల్‌రెడ్డి సమక్షంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, చవాన్ శంకర్, మండలాధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు మోహినొద్దీన్, పీఏసీఎస్ చైర్మన్ గంగాచరణ్ తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్‌లో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అంతకుముందు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు జొన్నల చంద్రశేఖర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రఫీక్ అహ్మద్, ఆత్మ కమిటీ చైర్మన్ సతీశ్, మంగ తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. బీఆర్‌ఎస్ కన్వీనర్ శ్యాంసుందర్, బాయమొల్ల భోజన్న, రత్నాకర్‌రావు, లక్ష్మణ్‌రావు, శ్రీధర్, గంగాధర్, దత్తురాం పటేల్, ముత్తగౌడ్, సాగర్, ముత్తన్న, వెంకట్‌రావు ఉన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, చిలుక రమణ, జిల్లా అధికార ప్రతినిధి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, తదితరులు పాల్గొన్నారు.

భైంసా: బాసరలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అల్పాహారం పంపిణీ చేశారు.

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయం, ప్రాథమిక పాఠశాలలో, కుంటాలలో సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాద్రి, సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటావార్ దశరథ్, వెంకటేశ్, పోశెట్టి, లక్ష్మణ్, పురుషోత్తం, రఘు, రమేశ్, గజేందర్, రాకేశ్, మహిపాల్, అనిల్, రాజు పాల్గొన్నారు.

ముథోల్: మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కేక్ కట్ చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# వేడుకలకు ముస్తాబైన శివాలయాలు

- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- తరలిరానున్న భక్తులు
- ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసిన గ్రామస్తులు



సోన్: సిద్దులకుంటలో సిద్ధేశ్వరుడు..



సారంగపూర్: వైకుంఠాపూర్‌లో..



నర్సాపూర్(జి): సుద్దవాగు ఒడ్డున ఆలయంలో..

సోన్: మండలంలోని ఎన్‌హెచ్44(జాఫ్రాపూర్) నుంచి 8కిలోమీటర్ల దూరంలో సిద్దులకుంట గ్రామంలో సిద్ధేశ్వరుడిగా శివుడు దర్శనమిస్తున్నాడు. గోదావరి తల్లి ఒడిలో లింగాకృతిగా రూపుదిద్దుకుని, ఒడ్డుకు చేరిన ఇక్కడి శివుడు అదే బండరాయిపై పూజలందుకుంటున్నాడు. భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్నాడు.

సారంగపూర్: మండలకేంద్రం నుంచి గొల్లమాడ వెళ్లే దారిలో వైకుంఠాపూర్(దోనిగాం)లో ప్రభుస్వామిగా శివుడు కొలువయ్యాడు. పురాతన ఆలయాన్ని జీర్ణోద్ధారణ చేసి ఇటీవలే నూతనంగా నిర్మించారు. జిల్లావ్యాప్తంగా భక్తులు ఇక్కడి వస్తుంటారు. అలాగే యాకర్‌పల్లిలో బసవేశ్వరుడిగా శంకరుడు పూజలందుకుంటున్నాడు.

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి అనుబంధమైన పాత డొంగుర్గాం శివారులో సుద్దవాగు ఒడ్డున సిద్ధేశ్వరుడిగా వెలిశాడు. నవసిద్ధులు, మునీశ్వరులు ఇక్కడ తపస్సు చేసినట్లు చెబుతారు. ఇక్కడి కోనేరులో శివరాత్రి రోజున పార్వతీమాత స్నానమాచరిస్తదని భక్తుల నమ్మకం.


తానూరు: మండలంలోని భోసి గ్రామంలో కాశీ విశ్వనాథుడిగా పూజలందుకుంటున్నాడు. ఇక్కడి పురాతన ఆలయంలో ఇప్పటికీ నిత్య పూజలు నిర్వహిస్తుంటారు. మహాశివరాత్రిని కనులపండువగా జరుపుతారు. భక్తులకు అన్నదానం చేస్తారు.

కుభీర్: మండలకేంద్రం నుంచి పల్సి మీదుగా 8కి.మీ. వెళ్తే మహారాష్ట్ర సరిహద్దున పాంగర్‌పాడ్‌లో జటాశంకరుడు దర్శనమిస్తాడు. శివరాత్రికి రెండు రోజుల పాటు రెండు రాష్ట్రాల ప్రజలు దర్శించుకుంటారు. ఇదే మండలకేంద్రానికి 5కి.మీ దూరంలో దార్‌కుభీర్ మీదుగా వెళ్తే బ్రహ్మేశ్వరాలయం ఉంది. ఇక్కడ అటవీప్రాంతంలో పరమేశ్వరుడు కొలువయ్యాడు.


**నాలుగు రోజుల పాటు జాతర**

కుభీర్: మండలంలోని పార్డి(బి)లోని రాజరాజేశ్వరుడి మందిరం జాతరకు ముస్తాబైంది. ఈ గ్రామంలో మొదటి సంతానంగా పుట్టిన బిడ్డకు శివుడి అర్థం వచ్చేలా పేర్లు పెట్టుకుంటారు. నాలుగురోజుల పాటు శనివారం నుంచి జాతర నిర్వహిస్తారు. చివరిరోజున బుధవారం నిర్వహించే కుస్తీపోటీలు ఆకట్టుకుంటాయి.

భైంసారూరల్: మండలంలోని సిరాల, చుచుంద్, చింతల్‌బోరి, మహాగాం, హంపోలి తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించే మహాశివరాత్రి వేడుకలకు శివాలయాలు ముస్తాబయ్యాయి.



తానూరు: భోసిలో కాశీవిశ్వనాథుడి ఆలయం



కుభీర్: పాంగర్‌పాడ్‌లో ఆలయం



భైంసారూరల్: చుచుంద్‌లోని సిద్ధేశ్వర ఆలయం

## మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



గోదావరికి వెళ్తున్న దిలావార్‌పూర్ భక్తులు

ఖానాపూర్: మండలంలోని బీర్నంది పంచాయతీ పరిధిలోని రంగపేట, దిలావార్‌పూర్ గ్రామాల్లోని రాజరాజేశ్వర ఆలయాల్లో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. రంగపేట ఆలయంలో అర్చకులు శంకరయ్య, శివ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, రుత్విగరణం, దీక్షాస్వీకారం, మహాదీపస్థాపన, మృత్సంగ్రహణం, అంకురారోపణం, అగ్నిప్రతిష్ట, అగ్నిముఖం, క్షేత్ర పాలకమండపారాధన, ధ్వజారోహణం మూర్తికుంభస్థాపన, సర్వదేవత ఆహ్వానం, పారాయణాలు ప్రారంభం, వాస్తుపూజ, శాంతిహోమం, భద్రమండలి ఆరాధన, బలిదానవిధి తదితర పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయా ఆలయాల పండితులు గోదావరికి వెళ్లి ఉత్సవమూర్తి ప్రతిమలకు పుణ్యస్నానం చేయించి ఆలయాలకు వెళ్లారు.

లోకేశ్వరం: మండలకేంద్రంలోని శివాలయంలో శుక్రవారం శాంతిపాఠం, దేవతాజ్ఞ, మహాసంకల్పం, గణపతి గౌరిపూజ, గోపూజ, అభిషేకాలంకరణ, హోమాన్ని వేదపండితులు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### యువకుడి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని సిద్ధార్థనగర్‌కు చెందిన చంద్రే మహానంద్ (25) శుక్రవారం రాత్రి గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఓ విద్యుత్ స్తంభానికి ఉరేసుకున్నాడు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.